క్లుప్తంగా

నేడు సాహితీ మిత్రమండలి ఆత్మీయ పురస్కారం

అద్దంకి రూరల్: ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వైదిక వాఙ్మయ పరిశోధకుడు, రచయిత పోలూరి వెంకట శివరామప్రసాదరావుకు అద్దంకి సాహితీ మిత్రమండలి ఆత్మీయ పురస్కారం ఆదివారం అందించనున్నట్లు మిత్రమండలి అధ్యక్షుడు లక్కరాజు చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మారంవారి సేవాసదన్‌లో దయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేస్తారు. శివరామప్రసాద్ రచించిన పుస్తకాలను శ్రీమాన్ నారాయణం బాలసుబ్రమణ్యం, డీవీఎం సత్యనారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, లక్కరాజు శ్రీనివాసరావు పరిచయం చేస్తారన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్‌ను హెచ్‌ఎంకు అందిస్తున్న ఉపాధ్యాయుడు

వేటపాలెం: అక్కాయిపాలెం మండల పరిషత్ పాఠశాలలకు ఉపాధ్యాయుడు మాగులూరి జయరావు ప్రింటర్‌ను శనివారం ఉచితంగా బహూకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం భవనం భద్రిరెడ్డి మాట్లాడుతూ ప్రింటర్‌ను స్కూల్‌కి బహూకరించిన దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసాబేగం, జి సందీప్ పాల్గొన్నారు.

యూనిఫాంకు నగదు అందజేత



టీచర్‌కు నగదు అందిస్తున్న దాత అనిల్‌కుమార్

చీరాల రూరల్: పద్మభాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అనాథశ్రమంలో నివశిస్తూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు స్కూలు యూనిఫాం నిమిత్తం నగదు అందజేశారు. శనివారం తన నివాసం వద్ద స్కూలు టీచర్‌కు నగదును అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు దాత అనిల్‌కుమార్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ శ్రమంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు, ఆర్థిక స్థోమతలేని మరికొంత మంది విద్యార్థులు యూనిఫాం కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్కూలు టీచర్ తన దృష్టికి తీసుకురావడంతో తనకు తోచిన విధంగా చిరు సాయం అందించినట్లు దాత అనిల్‌కుమార్ తెలిపారు.

గాలికుంటు వ్యాధులతో జరభద్రం

- మూగజీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి
- సూచనలందిస్తున్న డాక్టర్ ఆనంద్ భాగ్యరాజ్



డాక్టర్ ఆనంద్ భాగ్యరాజ్

కారంచేడు: ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో మూగ జీవాలను జాగ్రత్తగా గమనిస్తుండాలి. నోరులేని వాటిని ఒక కంటా కనిపెడుతూ వాటి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు గాలికుంటు వ్యాధులు సోకే అవకాశాలున్నాయని కారంచేడు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఆనంద్ భాగ్యరాజ్ అంటున్నారు. పశువులకు చికిత్స కన్నా వ్యాధి నివారణమే ముఖ్యమని ఆయనన్నారు. ఈ వ్యాధి నివారణకు ముందస్తుగా ప్రతి ఏటా ప్రభుత్వం పశువులకు ఉచితంగా టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం రాబోవు రోజుల్లో టీకాల కార్యక్రమం రూపొందిస్తుందన్నారు. మండలంలోని పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. వ్యాధి సోకడం వలన పశువులు మరణించే ప్రమాదముందని హెచ్చరించారు. మార్చి- ఏప్రిల్, ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లోనే ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. ఆవులు, గేదెల్లో వ్యాది లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను ఆయన వివరించారు.



గాలికుంటు వ్యాధి సోకిన పశువుల గిట్టలు



గాలికుంటు వ్యాధి సోకిన పశువుల పళ్లు..

ఇవి గాలికుంటు వ్యాధి లక్షణాలు..

- సూక్ష్మక్రిములు, వైరస్ వలన వ్యాధి సోకుతుంది
- వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలు తాగడం వలన దూడలకు కూడా వ్యాధి సోకుతుంది.
- పశువులకు నోటి, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి.
- మూడు, నాలుగు వారాల్లో బొబ్బలు చితికి అవి పుండ్లుగా మారతాయి. దీని వలన చర్మం గరుకుగా మారుతుంది.
- నోటిలో, చిగుళ్ల పైన పొక్కులు ఏర్పడటం వలన మేత, నీరు తీసుకోలేక నీరసించిపోతాయి.
- నోటిలో నుంచి చొంగ ఎక్కువగా కారుతుంది.
- 104 నుంచి 106 డిగ్రీల జ్వరం కూడా తీవ్రంగా ఉంటుంది.
- పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది.
- గర్భంతో వుండే పశువులు అబార్షన్‌లకు గురవుతాయి.
- ఒక్కోసారి పొదుగు మీద కూడా బొబ్బలు రావడం వలన పొదుగు వాపు వ్యాధి వస్తుంది.
- గిట్టల్లో వుండ్లు ఏర్పడటం వలన ఎద్దు వ్యవసాయ పనులు చేయలేవు.

ఈ నివారణ చర్యలు పాటించాలి..

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుగా ఉంచాలి.
- పశువుల మల, మూత్రాలను గడ్డితో కాల్చివేయాలి. దూడలకు వ్యాధి సోకిన తల్లి పాలను పట్టకూడదు.
- వ్యాధి సోకి మరణించిన పశువులను ఎక్కడపడితే అక్కడ పడవేయకూడదు. సున్నపు గోతిలో పాతిపెట్టాలి.
- సంవత్సరానికి రెండు సార్లు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించుకోవాలి.
- కాలి గిట్టల పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడగాలి.
- పుండ్లపై ఈగలు వాలకుండా నికుమేట్ లేదా వేపనూనెను పూయాలి.
- నోటిలోని పుండ్లకు బోరా గ్లిసరిన్ ఆయింట్‌మెంట్ రాయాలి.
- వ్యాధి తీవ్రత ఆధారంగ పశువైద్యులను సంప్రదించి తగిన సూచనలు, మందులను వాడుకోవాలి.
- ఉపశమనానికి 30 గ్రాముల ఎముకల పొడి వచ్చి మేతలో కలిపి ఇస్తే త్వరగా కోలుకుంటాయి.
- ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా పశువులకు టీకాలు వేయించుకోవాలి.

పంట దగ్ధంతో అనర్థాలు

- పంటల అవశేషాలే మలి పంటలకు బలం
- పర్యావరణానికి సైతం పెను విఘాతం

వేటపాలెం: భూమి రైతుల ప్రేమించినంతగా మరెవ్వరూ ప్రేమించలేరనేది వాస్తవం. తమకు జీవనాధారమైన పుడమి తల్లిని నమ్ముకొని పంటలు సాగుచేసి, దిగుబడులను అమ్ముకొని కుటుంబాలను పోషించుకో వడం మాత్రమే వారికి తెలుసు. ప్రకృతి వైపరీత్యాలు, వెరసి వారి ఆలోచన విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు పంట అవశేషాలను కలియదున్నడం ద్వారా అవశేషాలను ఎరువుగా మార్చుకొని సేద్రియ వ్యవసాయ విధానం ద్వారా మంచి దిగుబడులు సాధించేవారు. రైతులు ప్రస్తుతం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వాటిని దగ్ధం చేయడం ద్వారా పలు విధాలుగా నష్టపోతున్నారు. తెగుళ్ల అధికంగా ఆశిస్తుండటం వాటి నివారణ కోసం రసాయన ఎరువులు విరివిగా వినియోగించడం వల్ల వీటిని కలియదున్నితే ఆదుష్ప్రభావం తదుపరి పంటలపై ఉంటుందనేది రైతుల భావన. తద్వారా వాటిని తగుల బెడితే, తెగుళ్లకు కారణమయ్యే బాక్టీరియా నశిస్తుందనే ఆలోచనలో ఉన్నారు. మరి కొందరు త్వరితగతిన మరో పంట వేసుకు నేందకు వీలుగా అవశేషాలను తగుల బెడుతున్నారు. అయితే దీనివల్ల లాభం లేకపోగా, నష్టం అధికంగా ఉంటుందని వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు హెచ్చరిస్తున్నారు.



వేరుశనగ ఆకును చేలోనే తగల బెట్టిన రైతు

అనర్థాలు అనేకం..

గతంలో పంట కాలం పూర్తయిన పిదప రైతులు పంటల అవశేషాలన అలాగే ఉంచే వారు. మళ్లీ సాగు తరుణంలో వాటిని కలియ దున్నేవారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా వాటి అవశేషాలను కాల్చేస్తు న్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల కాలం పూర్తి యిన వెంటనే మరో పంట కోసం వాటి అవశేషాలనుతగుల బెట్టడం ఇటీవల పరిపాటిగా మారింది. ఈ ప్రక్రియ సులభమే అయినప్పటికీ ఎటువంటి లాభం లేకపోగా నష్టం మాత్రం తీవ్రంగా ఉంటుందని వ్యవసాయ శాఖాధికారులు పర్యావరణవేత్తలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పంట అవశేషాలను దగ్ధం చేయడం ద్వారా పర్యావరణానికి పెను విఘాతం కలుగుతుందని, అదేవిధంగా పంటలకు మేలు చేసే ఎరలు, ఇతర సూక్ష్మ క్రియులు పూర్తిగా నశిస్తాయని, తద్వారా భూమి నిస్సారమవుతుందని, ఫలితంగా ఎంత పెట్టు బడులు పెట్టినా ప్రయెజనం ఉండదని, పంటల అవశేషాలన కాల్చడం ద్వారా భూమితోపాటు పర్యావరణానికి సైతం హాని కలి గించినట్లవుతుందని ఏఓ ఐ కాశీవిశ్వనాద్ సూచిస్తున్నారు.

రైతులు పాటించాల్సిన సూచనలు..

అవశేషాలు తగులబెట్టడానికి బదులు భూమిలో మురగబెట్టి దక్కిలో కలిపి దున్నడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. వరి మొక్కను కింద వరకు కోసి గడ్డి కింద ఉపయోగించుకోవచ్చు. అవశేషాలను దుక్కిల కలిపి దున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి పంటకు మేలు చేకూరుతుంది. వేరుశనగ పంటను మిషన్‌లో వేసి నుజ్జు చేయకుండా పశుగ్రాసం కింద ఉపయోగించు కోవచ్చును. వరి పొలాల్లో రోటవేటర్ ద్వారా అలియదున్నితే పోషకాలు మొక్కలు అందుబాటులో ఉంటాయి.

రోటరీ ఆధ్వర్యంలో ఏరువాక వేడుకలు



ఏరువాక సాగుతున్న అరకలు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకానిపాలెం సచివాలయం వద్ద నిర్వహించారు. దానిలో భాగంగా క్లబ్ అధ్యక్షుడు చిన్న మురళీకృష్ణ ఎద్దులకు పూజ చేసి నవధాన్యాలను పొలంలో చల్లారు. ఎనిమిది జతల ఎడ్లతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకట కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన మాట్లాడుతూ మన దేశం వ్యవసాయ దేశమన్నారు. వ్యవసాయమే దేశానికి వెన్నెముకగా నిలిచినందున దానికి పూర్వకాలం నుంచి అంత ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. యేడు మారి మరో యేడులో నూతనంగా వ్యవసాయాన్ని ఏరువాక రోజు దుక్కిదున్నడంతో ప్రారంభిస్తాడని చెప్పారు. ఏరు అంటే నాగలి, వాక అంటే సాగడం అనే అర్థం కూడా ఉందని చెప్పారు. ఏది ఏమైనా ఏరువాక కళ తప్పుతున్న తరుణంలో రోటరీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టి నూతన తరాలకు ఆ పండుగ విశిష్టతను తెలియజేయడం అభినందనీయమన్నారు. తరువాత ఎడ్లతో అరక దున్నుతున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, పసుపులేటి అంజనేయులు, జిడ్డి హనుమంతరావు, జడ్డి సుబ్బారామయ్య, యరమోతు శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఏరువాక వేడుకలు..

బల్లికురవ: ఏరువాక పున్నమి వేడుకలు మండలంలోని రైతులు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి మిగులు, తగులుతో శనివారం ఉదయం బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లి గణనాథుడిని ప్రార్థించి వ్యవసాయ పనులు చేపట్టారు. ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని రైతులు ప్రార్థించారు.



రైతులను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం

బల్లికురవ: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే పూర్తి ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మమత అన్నారు. శనివారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో 104 ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో సైడు కాలువలు సక్రమంగా లేనందున మురుగునీరు రోడ్డుపై పారుతుందని దీనివల్ల ప్రజలు దోమకాటుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దోమల ద్వారానే మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు సోకే ప్రమాదం ఉందని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుటే సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉండదన్నారు. ఈ క్యాంపులో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రోగిని పరీక్షించి మాట్లాడుతున్న వైద్యాధికారి

సంఘ సేవకుడు అన్నంరాజు మృతి



అన్నంరాజు సుబ్బారావు

చీరాల అర్బన్: చీరాల ప్రాంతంలో పేరొందిన సంఘ సేవకులు అన్నంరాజు సుబ్బారావు (64) అనారోగ్యంతో శనివారం ఆయన నివాసంలో మృతిచెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతిచెందారు. రోటరీ క్లబ్, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్, రెడ్ క్రాస్, బ్రాహ్మణ సంక్షేమ సంఘం, తెలుగు భాషా సమాఖ్య తదితర స్వచ్ఛంద సంస్థల్లో పలు పదవులు చేపట్టి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రక్తదాన శిబిరాలు నిర్వహణతో పాటు ఆయన స్వయంగా 60 సార్లుపైగా రక్తదానం చేశారు. అలానే వివిధ స్వాతంత్ర్య ఉద్యమకారులు, తెలుగు కవుల జయంతి ఉత్సవాలను నిర్వహించిన ఆయన చీరాల ప్రాంత ప్రజలకు సుపరిచితులు. ఆయన మరణం తీరని లోటని పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చీరాల రూరల్: ఈపురుపాలేనికి చెందిన చేనేత మహిళ సుచరితను కొందరు దుర్మార్గులు హత్యాచారం చేసి ఆపై ఆమెను అత్యంత పాశవికంగా హత్యచేయడం దారుణమైన విషయమని.. ఈ ఘటనను బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ బాపట్ల, చీరాల నియోజకవర్గాల ఇన్‌చార్జులు డి. జగన్‌మోహన్‌రావు, కె. మార్కులు పేర్కొన్నారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఈపురుపాలెంలోని బాధిత కుటుంబ సభ్యులను కలసి ఓదార్చారు. అనంతరం నాయకులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపురుపాలెం ప్రాంతంలో గంజాయి, మద్యం సేవించే వ్యసనపరులు, జూదరులు ఎక్కువగా ఉన్నారని, వారు తమ ఇష్టారాజ్యంగా విర్రవీగుతున్నారని పోలీసులు చూసీచూడనట్లు ఉదాసీనంగా వ్యవహరించబట్టే అటువంటి దుర్మార్గులు పేట్రేగిపోతున్నారని వారు పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబ ప్రాంతం రైలు పట్టాల ఆవల ఏడారి ప్రాంతంగా ఉందని ఆయా ప్రాంతాలవైపు పోలీసులు దృష్టి సారించకపోవడం వల్లే విచారకరమైన ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి కేవలం నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. బాధిత కుటుంబంలోని ఆమె చెల్లికి ప్రభుత్వ ఉద్యోగం అందించి ఆ కుటుంబాన్ని పూర్తిగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



మృతురాలు సుచరిత తండ్రిని ఓదార్చుతున్న బీఎస్పీ నాయకులు

స్కూల్ బస్సులు తనిఖీ

ఒంగోలు: నగరంలోని స్కూల్ బస్సులను రవాణా శాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఏటా స్కూల్ బస్సులకు పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను విద్యా సంస్థల యాజమాన్యాలు పాటించాల్సి ఉంది. అయితే, దాదాపు సగం బస్సులు ఇంకా ఫిటినెస్‌కు రాకపోవడంతో రవాణాశాఖ అధికారులు రంగం లోకి దిగారు. వాస్తవానికి ఆ బస్సులన్నీ షెడ్లలో ఉంటున్నాయా.. లేక రోడ్డు మీదకు వస్తున్నాయా..? అనేది గమనించేందుకు తనిఖీలు చేపట్టారు. రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల ఆదేశాలతో నగరంలో శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, విద్యార్థుల బ్యాగులు పెట్టుకునేందుకు ర్యాకులు ఉన్నాయా.. లేదా..? అనేది పరిశీలించారు. ఓవర్ లోడింగ్ ఉండడానికి వీల్లేదంటూ హెచ్చరికలు జారీచేశారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డు మీదకు వచ్చిన ఒక పాఠశాల బస్సును సీజ్ చేశారు. సరైన సౌకర్యాలు లేని 4 బస్సులపై, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న 7 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ విద్యా సంస్థల బస్సులు నడిపేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సుల్లో ఎక్కే చిన్నారులకు రోడ్డు మీద పరిస్థితులు ఎలా ఉంటాయనేది తెలియదని, అందుకు ప్రతి బస్సుకు ఒక అటెండెంట్‌ను నియమించాలని స్పష్టం చేశారు. బస్సు ఆగేటప్పుడు, బస్సు స్లో అయ్యేటపుడు లైట్లు వెలిగించడంతో పాటు విద్యార్థులు బస్సు కిటికీలలో నుంచి తలలు, చేతులు బయట పెట్టకుండా డ్రైవర్, అటెండెంట్లు గమనిస్తుండాలన్నారు. యూనిఫాం ధరించాలని, కనీసం 5 సంవత్సరాల అనుభవం లేకుండా విద్యాసంస్థల బస్సులు నడపరాదని, అదే విధంగా 60 సంవత్సరాలు దాటిన వారు బస్సులు నడపరాదని తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా 74 బస్సులను తనిఖీ చేశామన్నారు. వాటిలో 12 బస్సులకు రూ.1,03,600 జరిమానా విధించినట్లు చెప్పారు. ఎవరైనా ప్రమాణాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో మార్కాపురం ఆర్టీవో అమర్‌నాయక్, ఎంవీఐలు రామచంద్రరావు, కిరణ్ ప్రభాకర్, ఎ.మాధవరావు, ఎల్.సురేంద్రప్రసాద్, రవినాయక్, కె.జయప్రకాష్ పాల్గొన్నారు.

రేపు మార్టూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని రాయల్ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 24వ తేదీ సోమవారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు మద్దుమాల కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ విద్యావేత్త గణేశుని రత్తయ్య చౌదరి అన్నపూర్ణమ్మ దంపతుల స్మారకార్థం మార్టూరు రోటరీ క్లబ్ సౌజన్యంతో వైద్య శిబిరాన్ని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. వైద్య శిబిరంలో గుండె చర్మం కళ్లు దంత వైద్య పరీక్షలతో పాటు ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. నోరు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, చెస్ట్ క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పిస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారు తమ వెంట తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డులను తీసుకురావాలని వారు కోరారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అతిసార వ్యాధి వేగంగా ప్రబలుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి అన్నారు. వలేటివారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకవైపు తీవ్ర ఎండలు, మరోవైపు వర్షం జల్లుల నేపథ్యంలో కొత్తనీరు వస్తోందన్నారు. ఫలితంగా స్వల్ప జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఏఎన్‌ఎం, పీహెచ్‌సీ వైద్యుల సలహాలు పొంది చికిత్స తీసుకోవాలన్నారు. లేని పక్షాన తప్పనిసరిగా ప్రాణాంతకమయ్యే అవకాశం ఉంటుందన్నారు. శరీరంలోని నీరు పూర్తిగా కోల్పోవడం వలన లోబీపీ, అతినీరసం, రక్తం పంప్ చేయలేని పరిస్థితికి చేరతారన్నారు. ప్రాథమికంగా గ్లూకోజ్ తీసుకోవడం ద్వారా ఉపశమనం కలుగుతుందని డాక్టర్ తెలిపారు. వలేటివారిపాలెం మెడికల్ క్యాంప్‌లో 200 మంది అవుట్ పేషెంట్లకు చికిత్స చేశారు.

నేటి నుంచి పోలేరమ్మ కొలుపులు



ముస్తాబు చేసిన పోలేరమ్మ ఆలయం

బల్లికురవ: గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో ఆదివారం నుంచి పోలేరమ్మకు కొలుపులు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 5 దశాబ్దాల క్రితం కొలుపులు జరిగాయని ఈ మధ్య కాలంలో జరపలేకపోవటంతో ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం ప్రారంభమయ్యే కొలుపులు గురువారంతో ముగుస్తాయి. శుక్రవారం అన్నసంతర్పణ చేపట్టనున్నట్లు తెలిపారు. కొలుపుల్లో భాగంగా వ్యవసాయ పనులకు సుదూర ప్రాంతాకు వెళ్లిన రైతులంతా తరలి రావటంతో గ్రామంలో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది.

ఇంకొల్లులో నేత్రదానం

చినగంజాం (ఇంకొల్లు): దానాలలో అవయవ దానం చాలా గొప్పది. ఇంకొల్లుకు చెందిన నేత్ర దానం నార్నె అరుణ (53) అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అవయవదానం కోసం రోటరీ కమిటీ సభ్యులకు తెలిపారు. శనివారం శంకరకంటి హాస్పిటల్ సిబ్బంది వచ్చి వెంటనే కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో అవయవ దాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్‌రావు, జెట్టి స్వామి, రోటరీ క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, సాంబశివరావు, హాస్పిటల్ డాక్టర్ సుధీర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని


అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్టమాసం, పూర్వాషాడ నక్షత్రం, పాడ్యమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అంజన్నకు లక్ష తమలపాకుల అర్చన

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి శనివారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించారు. దానిలో భాగంగా ప్రాతఃకాల అర్చన, బందెతీర్థం, అభిషేకం, గోపూజ, ప్రత్యేక అలకంరణ చేశారు. ఉభయదాతలతో వేదస్వస్తి, మంగళవాయిద్యములతో ఆలయ ప్రదక్షిణ, జీవధ్వజ, ఉష్ట్ర (ఒంటె) వాహనానికి ప్రత్యేక పూజ చేశారు. తరువాత గణపతి, సుబ్రహ్మణ్య స్వామి పూజ, 11 వరుసల్లో లక్ష తమలపాకులతో పూజ చేశారు. పంచహారతులు, మహానివేదన అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉభయ దాతలు బంధువులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ ఏసీ సుభద్ర పర్యవేక్షించారు.



అలంకరణలో స్వామివారు